క్లుప్తంగా

మునగపాకలో ఓటరు సర్వే

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో ఓటరు సర్వే కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారు. దీనిలో భాగంగా పోలింగ్ బూత్ 163లో ఆదివారం బీఎల్‌వో వీరునాయుడు, బీఎల్‌ఏ గంగునాయుడు సర్వేకు సంబంధించి ఓటరు జాబితాల్లో ఉన్న వివరాలపై ప్రచారం చేస్తున్నారు. సవరణలు, మార్పులకు సంబంధించి అవగాహన కల్పించారు. ఆగస్టు 21 వరకు సర్వే జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరుతున్నారు.

నేడు ఎస్‌ఈబీ స్టేషన్‌లో వాహనాల వేలం

పాయకరావుపేట : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో గల వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 31వ తేదీన వేలం వేయడం జరుగుతుందని ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎం.రామేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పట్టణంలో గల ఎస్‌ఈబీ కార్యాలయానికి వచ్చి వాహనాల వేలంలో పాల్గొనవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు హాజరు కావాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య తెలిపారు.

4న మండల ప్రజాపరిషత్ సమావేశం


పాయకరావుపేట : మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆగస్టు 4 వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల క్లాంపెక్స్ ఆవరణలో గల స్త్రీశక్తి భవన్ నందు ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రమదానంతో పొలానికి రోడ్డు


మూలపేటలో శ్రమదానంతో రోడ్డు నిర్మాణం చేస్తున్న దృశ్యం

మునగపాక : మూలపేటలో తమపొలాలకు వెళ్లేందుకు వీలుగా ఉండేలా ఆదారి సంఘం శ్రమదానంతో రహదారి నిర్మించుకుంటున్నారు. సంఘ సభ్యులంతా శ్రమదానం జోడించి రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆదారి కుటుంబ సభ్యులంతా ఈ రహదారి నిర్మాణంలో పాల్గొని శ్రమదానం చేశారు. పొలానికి వెళ్లేందుకు రహదారి సదుపాయం లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు సంఘ సభ్యులు ముందుకొచ్చి తమకు అనువైన రహదారిని నిర్మించుకున్నారు.

ఆశాజనకంగా వరి నారు


కట్టుబోలు సమీపంలో వరి నారు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో వరి నారుమడులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. వర్షాలు పడుతుండడం, శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో రైతులు తడులు పెట్టారు. దీంతో వరి నారు బాగా నాటడమే గాక పచ్చదనంతో కళకళలాడుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో దాదాపు 8 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

కోటవురట్ల : అణుకు గిరిజనుల దీక్షలు ఆదివారం 24వ రోజుకు చేరాయి. గిరిజనులతో పాటు సీపీఎం నాయకులు దీక్షలో కూర్చున్నారు. గిరిజనులు మాట్లాడుతూ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే తమ గ్రామం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.

పచ్చగా...జనం మెచ్చగా..

- మండలంలో విరివిగా మొక్కల పెంపకం
- 89 శాతం మేర ఆశాజనకంగా పెరుగుదల
- గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంతో సత్ఫలితాలు
- పండ్ల మొక్కలతో ఆదాయం

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పెంచాలని, మొక్కలు పెంచడం వల్ల పచ్చని వాతావరణంతో, వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచనలు మండలంలో సత్ఫలితాలు ఇస్తున్నాయి.

ఎస్.రాయవరం : ప్రతి ఏడాది సోషల్ ఫారెస్టు , ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటుతూ, వాటిని పెంచే కార్యక్రమం చేపడుతున్నారు. ఈ ఏడాది వర్షాల సీజన్ ప్రారంభంలో ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు ఎంపిక చేసుకున్న మొక్కలు మండలానికి తీసుకువచ్చి పంపిణీ చేశారు. వాటిలో దాదాపు 89 శాతం మొక్కలు ఆశాజనకంగా ఉన్నాయని పెంపకందారులు చెబుతున్నారు. ఈ ఏడాది మొక్కలు నాటిన వెంటనే పెంపకందారు అందించే నీటికి, వర్షాలు తోడవ్వడంతో నాటిన మొక్కలు అన్నీ బాగున్నాయని చెబుతున్నారు. గ్రామాల్లో మొక్కలు పెంపకం మరింత పెరగాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు చేయడంతో స్వయం సహాయక సభ్యుల కుటుంబాలతో మొక్కలు పెంచే కార్యక్రమం చురుగ్గా చేపట్టారు. సంఘ సభ్యులకు కావాల్సిన మొక్కలు కడియం నర్సరీ నుంచి ఎంపిక చేసి, ధర తగ్గించి మొక్కలు మండలానికి తీసుకువచ్చి సభ్యులకు అందజేశారు. ఇందులో మామిడి, కొబ్బరి, జామ, నేరేడు, నిమ్మ, సీతాఫలం వంటి పండ్ల మొక్కలు,


కడియం నర్సరీ నుంచి ఇటీవల తీసుకువచ్చిన మొక్కలు

పెరట్లో పెంచుకునే క్రోటన్స్ మొక్కలు సుమారు 5 వేలకు పైగా పంపిణీ చేశారు. ఇప్పటికే ఎన్‌జీఎస్ ఆధ్వర్యంలో జేవీపాలెం, ఎస్.రాయవరం, గుడివాడ తదితర గ్రామాల్లో చెరువుగట్లపై వేసిన మొక్కలు కాపు కాసే దశకు చేరుకున్నాయి. ప్రభుత్వ స్థలాల్లో పెంచిన మొక్కలు పంచాయతీకి, రైతు పొలాల్లో పెంచుకున్న వాటికి రైతుకు ఆదాయం ఇచ్చే వనరులుగా మారనున్నాయి. దీంతో మొక్కలు పెంపకంగా మండల వాసులకు లాభదాయకంగా మారింది.


గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు (ఫైల్)

తక్కువ ధరకే మొక్కల పంపిణీ



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రీన్ మిలీనియం ప్రోగ్రాంలో 5765 మొక్కలు పంపిణీ చేశారు. రూ.168 ఉండే కొబ్బరి మొక్క రూ.40లకే అందజేశారు. ప్రభుత్వ సహకారంతో తెచ్చిన మొక్కలు తక్కువ ధరకే లబ్ధిదారులకు అందజేశారు. మొక్కలు తీసుకువెళ్లిన వారు పెంపకంపై కూడా పర్యవేక్షణ చేస్తున్నాం. ఈ సీజన్ మొక్కలు ఇవ్వడంతో అందరూ సంతృప్తి చెందుతున్నారు.

– కె.గంగా శివప్రసాద్, ఏపీఎం, ఎస్.రాయవరం మండలం

మొక్కల పెంపకంపై అవగాహన



ఐకేపీ శాఖ నుంచి తీసుకువచ్చిన మొక్కలు లబ్ధిదారులకు అందజేశాం. వాటిని నాటే విధానంలో కూడా అవగాహన కల్పించారు. గతంలో తమ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో చాలా మొక్కలు నాటి పెంచే ఏర్పాటు చేశారు. అవసరం ఉన్న వారు మరిన్ని మొక్కలు అడిగితే నర్సరీలను తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం.

– రూపాదేవి, వీఓఏ, గుడివాడ

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అచ్యుతాపురం కూడలిలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఆర్.రాము మాట్లాడుతూ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు విద్యుత్ ఛార్జీలు పెంచడం వల్ల ఆయా కంపెనీలు నష్టాల బాట పడుతున్నాయని తెలిపారు. దీనివల్ల వేలాది మంది కార్మికులు రోడ్డున పడుతారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు ఒకటో తేదీన విజయనగరంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలకు నిరసనగా చేపట్టే సదస్సును విజయవంతం చేయాలని


అచ్యుతాపురం జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న దృశ్యం

పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.సోమునాయుడు, సత్యం రాజు, ఆంజనేయ, అభిజిత్తు, మైతాన్ కార్మికులు పాల్గొన్నారు.

సమన్వయ కమిటీ సభ్యునిగా సోమునాయుడు



అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండల సమన్వయ కమిటీ సభ్యునిగా కూండ్రపు సోమునాయుడు ఎన్నికయ్యారు. ఆదివారం అచ్యుతాపురంలో నిర్వహించిన వివిధ కార్మిక సంఘాలు, వివిధ రంగాలకు చెందిన సంఘాల సమావేశంలో సోమునాయుడును ఎన్నుకున్నారు. 25 సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్.రాము, విజయ, మంగమ్మ, విశ్వేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

తలసేమియా రోగులకు మేము సైతం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో ఆదివారం మిషన్ తలసేమియా కిడ్స్ ఖాజీపాలెం యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 33 మంది రక్తదానం చేశారు. తలసేమియా రోగులకు 21 రోజులకొకసారి రక్తాన్ని మార్చాల్సి ఉన్నందున, రక్తం కొరత ఉందని నిర్వాహకులు తెలిపారు. ప్రజల్లో రక్తదానం అవసరం గురించి, తలసేమియా రోగుల ఇబ్బందుల గురించి మరింత అవగాహన కలగాలని, రక్తదాన శిబిరాలను నిర్వహించాలని


ఖాజీపాలెంలో రక్తదానం చేస్తున్న దృశ్యం

వారు కోరారు. ఖాజీపాలెం యూత్ సభ్యులు పాల్గొన్నారు.

‘విశాఖ డెయిరీతో పాడి రైతులకు మేలు’


మామిడివాడ పాలకేంద్రంలో పాల సేకరణ

రాంబిల్లి : విశాఖ డెయిరీతో పాడి రైతులకు మేలు జరుగుతుందని మామిడివాడ పాల సంఘం అధ్యక్షుడు పప్పల కోటేశ్వరరావు అన్నారు. హెరిటేజ్ డెయిరీ నుంచి తమ పాల సంఘాన్ని విశాఖ డెయిరీకి మార్చడం జరిగిందని తెలిపారు. విశాఖ డెయిరీ పాడి రైతులకు సంక్షేమ పథకాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నెట్టెం సత్యనారాయణ, పాలసంఘం కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు

అనకాపల్లి రూరల్: పని ప్రదేశంలో మహిళా కార్మికులు, ఉద్యోగినులు లైంగిక వేధింపులకు గురవుతున్నారని శ్రామిక మహిళ రాష్ట్ర సమన్వయ కమిటీ నాయకురాలు రమాదేవి అన్నారు. స్థానిక దొడ్డి రామనాయుడు భవన్‌లో ఆదివారం గూనూరు వరలక్ష్మి అధ్యక్షతన శ్రామిక మహిళా సమన్వయ కమిటీ సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలును ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో బ్రాండిక్స్, జీడిపిక్కల పరిశ్రమలు, పలు దుకాణాలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనేక మంది మహిళా కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఎటువంటి చట్టాలు అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు,



శ్రామిక మహిళా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు రమాదేవి

కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశు, వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ రూపాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి మంజూషకు సత్కారం

మునగపాక : ప్రజలకు మెరుగైన సేవలందించాలని బొడ్డేడ సంఘ అధ్యక్షుడు బొడ్డేడ రామారావు కోరారు. ఆదివారం మునగపాకలోని పరదేశమ్మ తల్లి గుడి ఆవరణలో బొడ్డేడ కుటుంబీకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారిగా పనిచేస్తున్న బొడ్డేడ మంజుషను ఘనంగా సత్కరించారు. రామారావు మాట్లాడుతూ మంజుషను ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలన్నారు. అనంతరం సంఘ నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. అధ్యక్షునిగా బొడ్డేడ రామారావు, కార్యదర్శిగా బొడ్డేడ జగ్గారావు, కోశాధికారిగా గోవింద్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు బొడ్డేడ సోమరాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం హృద్రోగి దొడ్డి రామకృష్ణకు సంఘం నుంచి రూ.20 వేల మేర సాయం అందించేందుకు నిర్ణయించారు.

తీరు మారిన పల్లెలు

- సీఎం జగన్ పాలనలో గ్రామాల విశేష అభివృద్ధి
- విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట
- అడుగడుగునా అభివృద్ధి బాటలు

అనకాపల్లిటౌన్: జాతిపిత మహాత్మాగాంధీ పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్నారు. దేశవ్యాప్తంగా ఆయన బాటలో నడుస్తున్న రాష్ట్రాల్లో ముందంజలో ఉన్నది మన రాష్ట్రమేనంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పల్లెలకు ఇస్తున్న ప్రాధాన్యత అలాంటిది. గతంలో ప్రతి అవసరానికి పట్టణాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. ఇపుడా పరిస్థితి చాలా వరకు తగ్గింది. విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా కనీస అవసరాలన్నింటికీ గ్రామాలే ఆసరాగా నిలుస్తున్నాయి.

మారేడుపూడి ‘మెచ్చు’తునక

అనకాపల్లి మండంలోని శివారు గ్రామం మారేడుపూడి. ఇక్కడి నుంచి అనకాపల్లి పట్టణానికి 18 కి.మీ. దూరం. పెందుర్తి నియోజకవర్గంలోని పరవాడ మండలానికి, అనకాపల్లి మండంలోని పలు గ్రామాలకు ఈ ఊరు అనుసంధానంగా ఉంటుంది. గ్రామంలో మొత్తం జనాభా 2,330. గతంలో గ్రామస్తులు ఏ అవసరానికైనా ఇటు అనకాపల్లి, లేకుంటే పరవాడ వెళ్లాల్సి వచ్చేది. జగనన్న సంక్షేమ, అభివృద్ధి పాలనలో గ్రామానికి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. నాడు-నేడు పథకంలో స్కూల్‌ను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి పరిచారు. వీటికి రూ.96.63


మారేడుపూడి గ్రామ సచివాలయ భవనం

లక్షలు వెచ్చించారు. జాతీయ రహదారికి ఆనుకొని మారేడుపూడి మీదుగా శీరంశెట్టివానిపాలెం వరకు రూ.2.50 కోట్లతో రెండున్నర కిలోమీటర్ల మేర నూతన రహదారిని నిర్మించారు. దీంతో పట్టణాలకు మేమేం తీసిపోలేదంటూ గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

- గ్రామంలో నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలను రూ.18.33 లక్షలతో అభివృద్ధి జరిగింది.
- రూ.25 లక్షలతో గ్రామ సచివాలయ భవనాన్ని ఏర్పాటు చేశారు.
- ఎస్సీ కాలనీ నుంచి బీసీ కాలనీ వరకు రూ.12.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం
- రూ.1.50 లక్షలతో మంచినీటి ట్యాంకు ఏర్పాటు
- రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- రూ.17.50 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నిర్మాణంలో ఉంది.
- గ్రామంలో ఇళ్లులేని 146 మంది అర్హులకు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో ఇప్పటికే 20 శాతం ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకుని, గృహప్రవేశం కూడా జరిగింది. మిగిలిన వాటిని ఈ ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.
- గ్రామంలో ఇంటింటికీ కుళాయి పనులు శరవేగంగా సాగుతున్నాం

ఘనంగా స్నేహ మాసోత్సవాలు


పిండి వంటలను పరిశీలిస్తున్న అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు

అనకాపల్లిటౌన్: అంతర్జాతీయ స్నేహ మాసోత్సవ వేడుకలు ఆగస్టు 6 వరకూ నిర్వహిస్తున్నట్లు అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు బి.ఎస్.ఎం.కె.జోగినాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు పెంటకోట కన్వెన్షన్ హాల్లో క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పిండి వంటల పోటీలు, ప్రదర్శనను నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా డాక్టర్ అలేఖ్య, లక్ష్మీనారాయణరావు దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ ఏటా క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ఆగస్టు 6న అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులతో నాణ్యమైన ఎరువులు

ఎస్.రాయవరం : ప్రకృతి వనరులతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుని లాభసాటి వ్యవసాయాలు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి శ్యామల అన్నారు. వేమగిరి గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అనువుగా ఎన్‌పీఎం షాప్ ప్రారంభించారు. ఈ దుకాణంలో అవసరమయిన మీనామృతం, దశప్రతిక వంటి ఎరువులు సిద్ధంగా ఉంచడం జరుగుతోందన్నారు. నిత్యం ఈ దుకాణం పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తూ అవసరమైన ఎరువులు అందిస్తామన్నారు. గుడివాడ గ్రామంలో కూడా ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం జరిగింద


ప్రకృతి వనరులతో సేంద్రియ ఎరువులు తయారులు చేస్తున్న దృశ్యం

న్నారు. కార్యక్రమంలో డీపీఎం లచ్చన్న, ఐసీఆర్‌పీ కనకారావు, రాయుడు, వరలక్ష్మి పాల్గొన్నారు.

హృద్రోగి కుటుంబానికి వితరణ

మునగపాక : అనారోగ్యంతో బాధపడుతున్న హృద్రోగి దొడ్డి రామకృష్ణను ఆదుకునేందుకు తమవంతు సాయంగా మునగపాకకు చెందిన దొడ్డివారి సంఘం నుంచి ఆదివారం రూ.20వేల సాయం అందజేశారు. రామకృష్ణకు అవసరమయ్యే గుండెమార్పిడి చికిత్సకు అవసరమయ్యే సాయాన్ని పలువురు దాతలు ముందుకొచ్చి అందిస్తున్నారు. మరిడిమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.20వేల సాయాన్ని ఉత్సవకమిటీ సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు.


హృద్రోగి రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.20వేల సాయం అందజేస్తున్న దృశ్యం

సాగుదారులకు భూపట్టాలివ్వాలి

ఎస్.రాయవరం : ప్రభుత్వ భూమిలో సాగుదారులుగా ఉన్న నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. బంగారమ్మపాలెం గ్రామంలో సాగుదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. సుమారు 45 సంవత్సరాలుగా సాగులో ఉన్న రైతులకు ప్రయోజనం చేకూరే పనులు చేపట్టలేదన్నారు. ఇకనైనా సాగుదారులను గుర్తించి అర్హత ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని కోరారు.


సాగు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సత్యనారాయణ

168 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఎస్.రాయవరం : ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని కేజీహెచ్‌సీ మాజీ ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య అన్నారు. అడ్డురోడ్డు పరిసర ప్రాంతంలో పాయకరావుపేట నియోజకవర్గం ప్రజలకు ప్రతి ఆదివారం ఉచిత వైద్య సేవలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఆ క్రమంలో ఈ ఆదివారం కూడా అడ్డురోడ్డు బంగారయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 168 మంది రోగులు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వీరికి ఉచితంగా ట్రస్ట్ సిబ్బంది మొక్కలు పెంచుకున్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బంగారయ్య

నూకాంబికా.. నమోస్తుతే

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో, ఈ రోజు పూజిస్తే కోరిన వరాలిస్తుందన్న నమ్మకంతో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి, అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు తమ పిల్లలకు పాలిచ్చేందుకు అనువుగా ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ ఈవో బండారు ప్రసాద్ కల్పించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

రక్తదానంతో ప్రాణదానం

అనకాపల్లిటౌన్: ఆరోగ్యవంతుడైన వ్యక్తి రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న మరో ముగ్గురికి ప్రాణదానం చేసినట్టేనని మిత్రా అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ప్రతినిధి గుండా రమేష్‌గుప్తా అన్నారు. స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రతీ ఏడాది స్నేహితుల దినోత్సవం రోజున కలుసుకుని, రక్తదానంతో పాటు వివిధ సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులై వ్యక్తులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. విశాఖ ఏఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 60 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేశారు.


రక్తదానం చేస్తున్న జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1988 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సోనూసూద్ జన్మదినాన గొడుగుల పంపిణీ

అనకాపల్లిటౌన్: ప్రఖ్యాత నటుడు, కోవిడ్ విపత్తులో ప్రజలను ఆదుకోవడంలో ముందున్న సోనూసూద్ జన్మదిన వేడుకలు స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సోనూసూద్ అనకాపల్లి ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధి కొడుకుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, గొడుగులు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనూసూద్ కరోన సమయంలో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా చేసిన సేవలను వివరించారు. అనంతరం 300 మందికి గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కాండ్రేగుల నాయుడు, రేబాక మధు, కాండ్రేగుల రమణ, మద్దాల శ్రీను, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, తాడి శాంతి, గుండా సాయి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సోనూసూద్ జన్మదినం పురస్కరించుకుని నిరుపేదలకు గొడుగులు పంపిణీ